తోటికోడలు

“శ్రీ రాగి”

పున్నయ్య సాయంకాలం అయిదింటికి ఆఫీసు అయిపోగానే ఇంటికి వచ్చాడు.

అతను ఇంటికి వచ్చేటప్పటికి, ఇంట్లో రామరావణ యుద్ధం జరుగుతున్నది, ఇంటి ఆడవాళ్ళకీ, తన శ్రీమతికీ మధ్య.

పున్నయ్యకు ఇంటామె మండుతున్న అగ్నిగోళంలా కనుపించింది. మరి మండుతున్న అగ్నిగోళంవైపు, పున్నయ్య తన దృష్టులను ఎలా సారించగలడు?

ఇంటామె వాదులాడే భంగిమ చూసిన తర్వాత పున్నయ్య కాశ్మీరు సమస్య విషయంమీద వాదించడానికి భారత ప్రభుత్వం ఆమెను మిత్రరాజ్య సమితికి ఎందుకు పంపించదా, అని తలపోశాడు.

పున్నయ్య ఆ ఇంట్లో ప్రవేశించి సంవత్సరన్నర అయింది. మొటమొదట ఆ రెండు కుటుంబాలమధ్య పేచీలేమీ లేకుండానే సవ్యంగా జరిగిపోయింది. వాళ్ళింట్లో వీళ్లూ, వీళ్లింట్లో వాళ్లూ భోజనాలు చేస్తూ వుండేవారు. అప్పుడప్పుడు జరుగుతుండే చిన్న చిన్న గృహోత్సవాలలో చిన్న చిన్న కట్నాలు ఇచ్చిపుచ్చుకోడాలు జరుగుతుండేవి.

అయిదారు నెలల క్రిందట ఆ ఇంటి యజమాని చనిపోయ్యాడు. ఆయన ఇద్దరి కొడుకులూ ఆస్తీ ఇల్లూ పంచుకొన్నారు. ఆ ఇంట్లో మొత్తం మూడుభాగాలు. పెద్ద కొడుకు నాగేశ్వరరావు కొక పెద్దభాగమూ, చిన్న కొడుకు సుబ్బారావుకు రెండు చిన్న భాగాలూ వచ్చినయి.

పున్నయ్య వుంటున్న భాగం సుబ్బారావుకు వచ్చింది. నాగేశ్వరరావుకు ముగ్గురు మగపిల్లలున్నారు. వాళ్లు మహా తుంటరిపిల్లలు. పున్నయ్య ప్రతినెలా ఇరవై రూపాయలు అద్దె ముద్ర శుద్ధిగా చెల్లించేవాడు.

అన్నదమ్ములు విడిపోయిన తర్వాత పున్నయ్య, అద్దె సుబ్బారావుకే చెల్లిస్తుండేవాడు.

ఆ అద్దెతో తన కేమీ సంబంధం లేకపోయినా, నాగేశ్వరరావుభార్య చంద్రమ్మకు, ఎందుకో అకారణంగా తోటికోడలి కుటుంబంమీద అసూయ కలిగింది. అది సాకుగా పున్నయ్య కుటుంబాన్ని ఏదో నెపంతో అనరాని మాట లంటుండేది. పున్నయ్య భార్య ఇందిర చాలావరకు ఓర్పుతో నెట్టుకుంటూ వచ్చింది.

ఆరోజున పున్నయ్య కొడుకు నారాయణ జుట్టు చంద్రమ్మ కొడుకు చిన్న కత్తెరతో కొద్దిగా కత్తిరించాడు.

నారాయణ ఏడుస్తూ తల్లిదగ్గర కొచ్చి-

“అమ్మ చూడవే, వాళ్ల రాముడు, నా జుట్టు ఎలా కత్తిరించాడో!” అంటూ ఫిర్యాదు చేశాడు.

కత్తిరించబడిన జుట్టు చూసేసరికి అటువంటి తుంటరిపిల్లడి తల్లి అయిన చంద్రమ్మ మీద ఇందిరకు కోప మొచ్చింది.

అదివరకు ఇలానే రెండు మూడుసార్లు చంద్రమ్మ కొడుకు రాముం నారాయణని కొట్టాడు. కాని ఇందిర తొందరపడే స్వభావం కలది కాదు కనుక అప్పటికి ఊరుకొంది. ఆ సందర్భాలలో చంద్రమ్మ తన కొడుకు నారాయణని కోపపడినట్లు ఎక్కడా కనపడదు.

తన కొడుకు చేష్టలు తెలిసికూడా మందలించని చంద్రమ్మమీద, ఇందిరకు మనస్సులో కుట్రగానే వుంది.

ఇందిర నారాయణను తీసుకొని చంద్రమ్మ దగ్గర కెళ్ళి “చూశావుటమ్మా మీ కొడుకు ఏం చేశాడో?” అంది.

చంద్రమ్మ ఒక్క తీక్షణమైన చూపు ఇందిర వేపు విసిరి—“ఆఁ. ఏం చేశాడు మా అబ్బాయి?” అంది.

“చెయ్యాల్సిందే చేశాడు. మా అబ్బాయి జుట్టు కత్తిరించాడు. ఇటు చూడండి వెనకాల ఎలా కత్తిరించాడో.”

“మా అబ్బాయే కత్తిరించాడని యేమిటి సాక్ష్యం?”

“దీనికి సాక్ష్యాలు కావాలా? ఈ చుట్టు ప్రక్కల మీవాడికన్నా తుంటరి ఎవరున్నారు?”

“ఏమమ్మాయి. మీ అబ్బాయి మహా బుద్ధిమంతుడన్నట్టు మాట్లాడుతున్నావు?” స్థాయి హెచ్చించింది చంద్రమ్మ.

“అవును మావాడు బుద్ధిమంతుడే.”

“అందరు తల్లులూ అలాగే అనుకొంటారు.”

“మీవాడి బుద్ధి ఈ చుట్టుప్రక్కల అందరికీ తెలుసు!”

“ఏమమ్మాయి, మా ఇంట్లో వుంటూ, మమ్మల్ని అనవసరంగా మాటలంటే పడేదాన్ని కాను”

“నేనేం అనవసరంగా అంటల్లా. మీ అబ్బాయి మావాడి జుట్టు కత్తిరించాడు. పిలిచి బుద్ధిచెప్పండీ, అంటున్నాను”

“మావాడు కత్తిరించలేదంటుంటే ఏమిటీ వితండవాదం? అయినా మీవాడిని మావాడిదగ్గరికి రాకుండా చేసుకోరాదూ, వాడిమీదపడి ఇదవకపోతే?”

“అయితే పిల్లలూ, పిల్లలూ ఆడుకోనేది పోయి ఇటువంటి పిచ్చిపనులు చేస్తే ఎలా? ఇంతకి మీవాణ్ణి అదుపులో పెట్టారా లేదా?

“నీ పిల్లాణ్ణి అదుపులో పెట్టుకో లేకనన్నంటావేమమ్మా?”

ఈ పోట్లాట క్రమంగా పెద్దదైపోయి అనేక విషయాలు ఆ వాగ్వాదంలో దొర్లి

“కాపిటల్ లిస్టు”

శాశ్వత ‘తాత్కాలిక రాజధాని’—కర్నూలు

తాత్కాలిక ‘శాశ్వత రాజధాని’—విశాఖపట్నం

‘శాశ్వత రాజధాని’— విజయవాడ-గుంటూరు.

శాశ్వత ‘అశాశ్వత రాజధాని’—హైదరాబాదు.

నయి. చివరకు చంద్రమ్మ పెద్దగొంతుతో పున్నయ్య కుటుంబంగురించి చాలా నిరసనగా మాట్లాడింది.

"ఇంతమంది ఈ ఇంట్లో ఉండివెళ్లారు, కాని ఇటువంటి దౌర్భాగ్యుల నెక్కడా చూడలేదు"

"ఇల్లు మీదిగదా అని నానామాటలంటే పడేవాళ్లెవరూ లేరిక్కడ. అనేకమంది ఇంటివాళ్లను చూశాముగాని, ఇంత గయ్యాళి మనుష్యుల నెక్కడా చూడలేదు"

"ఇల్లంతా నాశనం చేశారు. గచ్చు అంతా పగలకొట్టారు. తలుపు లిరగ్గొట్టారు. వీళ్ళిచ్చే ముష్టి అద్దె సంవత్సరానిది ఖర్చు పెట్టినా మళ్ళీ ఇంటికి రూపం రాదు. ఇల్లంతా దెయ్యాలకొంప చేశారు."

"శిథిలావస్థలో ఉన్న ఈ ఇంట్లో చేరడం మాదే బుద్ధితక్కువ. ఈ కొంపకోసం ప్రతీ నెల ఇరవై రూపాయలు పోస్తున్నాము."

"అంత పీడగావుంటే ఖాళీచేసి లేచిపోరాదూ?"

"ఖాళీచెయ్యక ఇక్కడ మేమేం పాతుకుపోతా మనుకోటంలేదు. ఈమాదిరి కొంప ఇంత వూళ్లో మాకు దొరక్కపోదు."

"మీలాంటివాళ్లు ఎంతో అదృష్టంచేస్తే కాని దొరకరు."

"అసలు ఇల్లు మీ మరిదిగారిదయితే మీ పెత్తన మేమిటి మధ్య?"

"మా మరిదిదయితే మాది కాదూ? అన్నదమ్ములు బావుంటం నీ కిష్టంలేక తగూ పెడదామని చూస్తున్నావా?"

చంద్రమ్మ కోడికోడలు ఇంట్లో పని చేసుకొంటూ వీళ్ళ పోట్లాటలో జోక్యం కల్పించుకోలేదు.

పున్నయ్య వచ్చిన తర్వాత కాసేపు ఆగి చూశాడు; చంద్రమ్మ తన ధోరణి బందు చేస్తుందేమోనని - కాని చంద్రమ్మ ఊరుకుంటేగా?

పున్నయ్య జోక్యం కలిగించుకొని ఇలా అన్నాడు: "పిన్నిగారూ, మీరు ఇల్లుగలవాళ్ళంగదా అని యేమేమో నోరుజారి మాట్లాడటం బాగుండదు. కొంచెం జాగ్రత్తగా మాట్లాడటం మంచిది."

పున్నయ్య మాటలు విన్న చంద్రమ్మ తారాపథానికి లేచింది. "అమ్మో రాత! మగాడు ఆడదానిమీద పోట్లాటకి బయలుదేరాడు, ఆడంగి రేకులాగా!" అంటూ అరవటం మొదలు పెట్టింది.

కలహం ఆరంభమైనప్పటినుంచీ సుబ్బారావు ఇంట్లోనే వున్నాడు. కాని నోరు మెదపలేదు.

పున్నయ్య, ఇందిరను జవాబు చెప్పొద్దన్నాడు, చంద్రమ్మ ఎంత అరుచుకొన్నా.

ఆ తర్వాత పున్నయ్య కుటుంబంమీద చంద్రమ్మ, కొన్ని ఆంక్షలు విధించింది.

పున్నయ్య ఇంటికి ఒకరిద్దరు చుట్టాలొచ్చి రెండుమూడు రోజులుంటే - చంద్రమ్మ.

"రోజ్జూన పోయేవాళ్లంతా వచ్చి ఇల్లు పాడుచేస్తున్నారు" అని సాధించేది పున్నయ్యకి, వాళ్లకు వినపడేలాగ.

ఇంక వేసవికాలంలో మంచినీళ్ల బావి దగ్గర నీళ్ళు తెచ్చుకొంటుంటే, రోజూ ఇందిరమ్మ ఎన్నిబిందెలు తెచ్చుకొన్నదీ లెక్కగట్టేది.

తోటికోడలికి చంద్రమ్మ ఒక ఆలోచన చెప్పింది. పున్నయ్యను ఖాళీచేయిస్తే, ఇక్కరువును బట్టి ఈ రోజుల్లో ఆ ఇంటికే ముప్ఫయి రూపాయల అద్దె తేలికగా సంపాదించే అవకాశం లేకపోలేదని. సుబ్బారావు భార్యకు చెవినిల్లు గట్టుకొని బోధించింది. చంద్రమ్మ మాటలు వినగా, వినగా, సుబ్బారావు దంపతులకు కూడా, పది రూపాయలు ఎక్కువగా వచ్చే అవకాశముంటే ఎందుకు వదులుకోవా లనిపించింది.

ఒక రోజున చంద్రమ్మ ఇంట్లో కాశీ సమారాధన జరుగుతున్నది. చంద్రమ్మ భర్తను పిలిచి పున్నయ్యను భోజనానికి పిలవమంది. ఒకవేళ పున్నయ్య భోజనానికి వస్తే అంతా అయిపోయిన తర్వాత, ఎప్పుడో అదను దొరికినప్పుడు—'మా ఇంట్లో వుంటూనే, భోజనాలు చేస్తూనే, మామీద పోట్లాడతారు. వాళ్లకు సిగ్గా, శరమా?' అని సాధించచ్చు. భోజనానికి రాకపోతే, ఇంట్లోనే వుండి ఇష్టం లేక, భోజనానికి రాలేదని సాధించవచ్చు. అంత భోజనం చేయటమే ఇష్టం లేనివాళ్ళు వాళ్ళింట్లో వుండట మెందుకని సాధించవచ్చు' అని ఆమె అనుకొంది.

కాని పున్నయ్య కూడా సామాన్యుడుగాడు.

"ఈ కాశీ సమారాధన సంగతి, వాళ్ళు భోజనానికి పిలవబోయే సంగతి ముందుగానే ఊహించి, పెద్ద అర్జంటుపని ఉన్నవాడు లాగా పరాయి వూరు ప్రయాణం తలపెట్టాడు.

నాగేశ్వరరావు పున్నయ్యని భోజనానికి పిలవటమూ జరిగింది, పున్నయ్య తెపయాణం మిషమీద, రానని చెప్పి తప్పించుకోటమూ జరిగింది. దీనితో చంద్రమ్మ వేసిన ఎత్తు పారలేదు.

(52-వ పేజీ చూడండి)



(9-వ పేజీ తరువాయి)

అనుకున్న మాట అక్షరాలా జరిపించి తీరాల్సిందే. ఈ చిరాకు పరాకు లేవీ పనికిరావు, అని హెచ్చరించుకొని రిష్టు వాచీ చూశాను. పెద్దముల్లప్పుడే యిరవై తొమ్మిదో నిముషాన్ని దాటుతోంది "ఇంక నీతో పనిలేద"నుకొని సెకండ్లముల్లు మీదికి మరలించా చక్షువుల్ని. కాలమనే టేపుని చుట్టేస్తున్నట్టు చకచకమని శరవేగంతో తిరిగిపోతోంది సెకండ్ల ముల్లు. పదీ, ఇరవై, ముప్ఫై, నలభై, యాభై అప్పుడే దాటేసింది. సరిగ్గా అరవయ్యో అంకె దాటేసరికల్లా అడుగు వేద్దామని ఫిజిక్సు ఎక్స్‌పెరిమెంటేదో ప్రారంభించబోయేవాడిలా చూస్తున్నా. అందులోను కొంచెం ముందుకువంగి, రిస్టువాచీ వంకే చూస్తూ, 'స్టార్ట్' అనగానే పరిగెట్టడానికి సిద్ధంగా ఉన్న రేసు రన్నరు పోజులో నిల్చున్నా.

ఏభైయేడో సెకండు దాటిపోయింది. యాభైతొమ్మిది దగ్గరకొస్తోంది.

హఠాత్తుగా నా చెయ్యి దృష్టిపథంలోంచి తప్పిపోయింది! పక్కనించెవడో దూసుకు పరిగెట్టిపోతున్నాడు. ఇంతట్లో వెనకనుంచి 'బొంయ్' మంటూ హారను వినిపించింది. అనుకోకుండా ఒక్కసారి తిరిగి చూసి వెంటనే వాచీ చూసుకునేసరికి సెకండ్లముల్లు అరవై దాటిపోయి అప్పుడే రెండో సెకండు దగ్గర ఉంది!

ఎక్స్‌పెరిమెంటంతా పాడయిపోయింది!

"ఇప్పుడేం చెయ్యను? తొమ్మిదిన్నర అయిపోయిందికదా యింకా ఉంటే మాట తప్పిపోయి నట్లవుతుందేమో. పోనీ వెళ్ళిపోదామంటే ఇంతసేపూ ఉండి బస్సు వస్తూంటే యిప్పుడా?"

ప్రతిజ్ఞాపాలనం ముందుకు నెట్టుతోంది. ఆశాపాశం వెనక్కు లాగుతోంది. ఎటు వెళ్ళడానికీ తోచలేదు.

"అయినా ఆ వెధవెవడో సరిగ్గా సమయానికే చెయ్యి తూలగొట్టేశాడు. సిగ్గులేకుండా అంబోతు కోడిలా రోడ్డుమీద పరిగెడుతూను. ఛీ వాణ్ణించే అయిందంతాను. పారిపోయేడుగాని లేకపోతే పట్టుకుని న్యూసెన్సు కేసు పెట్టి డొక్క చించేద్దును." వాడిమీద కోపం అంతా గాలిలో చూపించేను.

"ఇంతకీ యిప్పుడెలాగూ తొమ్మిదిన్నర దాటిపోయింది; బయల్దేరడమా అయింది కాదు. అంచేత ఈ హారనుమోతేదో చూసే పోదాం" అని నిల్చుండిపోయాను.

చివరకి ఆశాపాశమే గెల్చేసింది.

ఈ మానసిక యుద్ధంతో ఒక మూడునిమిషాలైంది. ఈలోగా మళ్ళీ ఏ శబ్దం వినిపించలేదు.

"కొంపదీసి అది బస్సు కాకుండా పోదుగదా. ఇంతా మాట కూడా..." అని భయపడుతూండేసరికల్లా 'బొంయ్' మని వినిపించింది.

"ఆఁ బస్సే!" ప్రాణాలు కుదుటబడ్డాయి. "అక్కడక్కడ ఆగుతూవస్తోంది కాబోలు. ఈ సిటీ సర్వీసువాళ్ళింతే. దారిలో ఎక్కడ పడితే అక్కడ ఆపేసి మనుషుల్ని ఎక్కించేసుకోవడం, అసలు హాల్టింగులదగ్గర ఖాళీలేదని చెయ్యితిప్పుతూ ఆగకుండా పోతూండడం, ఇదో తమాషైన ఆటలాగుంది వాళ్ళకి. అయినా ఇప్పుడలా కాదులే. ఎంచేతంటే ఆలస్యాన్ని బట్టి చూస్తే చాలచోట్ల ఆగుతున్నట్లుంది. అంటే ఎక్కువ ఖాళీగా వుందన్నమాట."

నా 'రీజనింగు' నాకే వింతగా అనుపించింది. ఎలాగైతేనేం యీవిధంగా తర్జనభర్జన చేస్తూ పచార్లు కొడుతున్నా.

మళ్ళీ హారను వినిపించింది.

ఆఁ! దగ్గర కొస్తున్నది, వేగంగా రా అమ్మా! తల్లీ! ఇప్పటికే 9. 37 అయిందా, పోనీ ఓ అయిదు నిమిషాలు ఆలస్యంగా వెళ్ళినా, ఏటెండెన్సు దక్కించుకోవచ్చు, పాఠం మాటెలా ఉన్నా" అని సర్దుకొని ఎదురు చూస్తున్నా.

మరోకసారి హారను శబ్దంతో బుర్రుమంటూ వంక తిరిగి దర్శన మిచ్చింది, యింతసేపటినుంచి నేను నిరీక్షిస్తూన్న...

"అరి దీని తస్సాదియ్యా! ఇదా యింతసేపూ ఉండుండి కూసింది" అప్రయత్నంగా నా నోటినుంచి మాట లొచ్చేశాయి, ఆపమనడానికి ఎత్తిన చేయి ఎత్తినట్లే ఉండగా.

ఏం చెప్పమంటారు? ఆ వస్తూన్నది సిటీ బస్సు కాదు, మునిసిపాలిటీ చెత్తలారీ!!! ఇందాక అక్కడక్కడ ఆగడం మనుషుల్నెక్కించుకుందికి కాదు, చెత్త నెత్తించుకోడానికి. ఛీ ఆశాపాశం ఎంత పనిచేసింది? అయినా యీ సిటీ బస్సునెవడు నమ్మమని చెప్పేడు! దేవుడిచ్చిన కాళ్ళతో హాయిగా నడిచిపోకుండా? బుద్ధి వచ్చింది బాబూ! ఇంక జన్మలో మళ్ళా యిటువంటి తెలివితక్కువ పని చెయ్యను అని లెంపలేసుకున్నాను.

అప్పటికే తొమ్మిదీ నలభై అయింది. ఇంక జట్కా కట్టించుకున్నా, అది "స్పెన్సరు అప్" ఎక్కేసరికి సూర్యుడూ నడినెత్తిమీది కెక్కుతాడు. అంచేత డబ్బు దండుగే గాని మరేం లాభంలేదు. అయినా యివాళ చేసిన తప్పిదానికి శిక్షగా యీ ఎండలో నడిచి వెళ్లాల్సిందే. ఎలాగా ఫస్టు పిరియడు 'హీటు' పాఠం పోయింది. ఆ హీటేదో యీ విధంగా అనుభవించినా కొంత బుద్ధి వస్తుంది, అనుకొని 'దేవుడా గోడా' అని బుర్రమీద రుమాలు వేసుకొని బయలుదేరాను, యూనివర్సిటీకి. ★

(11-వ పేజీ తరువాయి)

కాని ఎంతకాలమని ఇలా ఇంటివాళ్లతో మాటా మంతీ లేకుండా, ముల్లుమీదున్నట్లు, ఆ ఇంట్లో కాపురం చేయటమో, పున్నయ్యకు అర్థంగాక, చివరికి విసుగెత్తి మరో రెండునెలల్లో ఇల్లు ఖాళీచేసి ఇంకో ఇంట్లోకి మారాడు.

ఇప్పుడు చంద్రమ్మకు హాయిగా వుంది. ఎవరు వచ్చినా ఆ ఇల్లు తనదే అయినట్టు చంద్రమ్మ ముప్ఫయి రూపాయలకు దమ్మిడీ తగ్గితే ఇవ్వడానికి వీల్లేదని చెప్పేది. కాని ఆ చిన్న భాగానికి ఎవరూ ముప్ఫయి రూపాయలు ఇవ్వడానికి ఒప్పుకోలేదు.

పైగా పున్నయ్య కుటుంబాన్ని లేవగొట్టడానికి చంద్రమ్మ ఆంక్షలు విధించినందువల్ల, ఆ ఇంటివాళ్లు మంచివాళ్లు కాదనే పేరు మ్రోగిపోయింది ఊళ్లో.

ఆరునెలలు గడిచినా, పున్నయ్య ఖాళీ చేసిన భాగం ఖాళీగానే వున్నది. చంద్రమ్మ, అందుకు లోలోపల ఎంతో సంతోషిస్తూ, పైకిమాత్రం తోటికోడలుతో - "పోనీయి, ఎవరూ రాకపోతే హాయిగా ఇల్లంతా మనమే వాడుకోవచ్చు. వాళ్ళిచ్చే ముష్టి ఇరవై రూపాయలకీ నానాగోలచేసి ఇల్లంతా పాడుచేస్తారు. ఇప్పుడు చూడు ఇల్లెంత నిశ్శబ్దంగా హాయిగా వుందో, పిల్లల కొట్లాటలు, పేచీలు లేకుండా" అనేది.

చంద్రమ్మ ఆంతర్యం తెలుసుకోలేక ఆమె చెప్పిన మాటలకు 'ఊఁ' కొట్టేది; సుబ్బారావు భార్య. ★